నూతన చట్టాలపై పోలీసులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్, మే 28 : జూలై 1 నుంచి నూతనంగా అమలయ్యే చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన, పరిజ్ఞానం పెంచుకోవాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అధికారులకు సూచించారు. నూతన చట్టాల అమలులో భాగంగా మంగళవారం ఆయన 'వర్క్ షాప్ ఆన్ న్యూ క్రిమినల్ లా'(ఎన్‌సీఎల్)పై జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కానిస్టేబుల్ నుంచి ఉన్నతాధికారుల వరకు విడతల వారీగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. నూతన చట్టాలపై పోలీస్ సిబ్బంది సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని, నేర, న్యాయ వ్యవస్థను పూర్తిగా మార్చేందుకు కొత్తగా రూపొందించిన 3 చట్టాలు భారతీయ న్యాయ సంహిత(బీఎన్ ఎస్), భారతీయ సురక్ష సంహిత (బీఎన్ఎస్ ఎస్), భారతీయ సాక్ష్యా అధినియం(బీఎస్ఏ) డిసెంబర్ 21, 2023లో పార్లమెంట్‌లో ఆమోదం పొందాయని వివరించారు. ఇవి జూలై ఒకటి నుంచి పూర్తిగా అమల్లోకి రానున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో కేసుల దర్యాప్తు, విచారణలో పాటించాల్సిన నూతన విధానాలపై సిబ్బందికి పూర్తి పరిజ్ఞానం కోసం వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ శిక్షణ ద్వారా పోలీసులకు రానున్న రోజుల్లో బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎలా స్వీకరించాలి?, ఏఏ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలి?, నిందితులకు ఏ విధమైన శిక్షను విధించేందుకు కృషి చేయాలి?, అనే అంశాలపై అవగాహన వస్తుందని వివరించారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష, భారతీయ సాక్ష్య అధినియం వంటి అంశాలు శాంతభద్రతల పరిరక్షణలో మైలురాయిగా నిలుస్తాయన్నారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందన్నారు. శిక్షణ కార్యక్రమాలు వర్టికల్స్ డీఎస్పీ గండ్రాతి మోహన్ నేతృత్వంలో డీసీఆర్బీ సీఐ సత్యనారాయణ, డోర్నకల్ సీఐ ఉపేందర్, ఎస్సై మాలోత్ రమాదేవి ఆధ్వర్యంలో జరగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, ట్రైనీ ఐపీఎస్ చేతన్ పండరీ, మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ పాల్గొన్నారు.

నత్తేనయం..!

- నెమ్మదిగా అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు
- 25శాతం నిధులు మాత్రమే విడుదల చేసిన ప్రభుత్వం
- జిల్లాలో 440 పాఠశాలలు ఎంపిక
- పనులపై నిర్దిష్ట ప్రణాళిక కరువు
- ఇప్పటి వరకు ఏ ఒక్క పాఠశాలలో కూడా పూర్తి కాని పనులు
- ఈ నెల చివరి వరకు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశం

మహబూబాబాద్ రూరల్, మే 28 : జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు నత్తనడక సాగుతున్నాయి. నూతన విద్యాసంవత్సరం సమీపిస్తున్నా పాఠశాలల మరమ్మతు పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. జిల్లాలో మొత్తం 628 ప్రభుత్వ పాఠశాలల్లో 45,413 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వం ఉన్నత పాఠశాలను గాలికొదిలి, కేవలం ప్రాథమిక పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో మరమ్మతు పనులు చేయిస్తున్నది. అయితే నెల రోజుల నుంచి పనులు చేయిస్తున్నా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. మరమ్మతు పనులను ఎస్ఎంసీ చైర్మన్లు, పాఠశాల హెడ్‌మాస్టర్లకు అప్పగించింది. కాగా, వేసవి సెలవులు రావడంతో హెడ్ మాస్టర్లు పాఠశాలలకు వెళ్లడం లేదు. ఎస్ఎంసీ సభ్యులు మాత్రమే పనులను పర్యవేక్షిస్తుండడంతో జాప్యం జరుగుతున్నది. జిల్లాలో ఇప్పటి వరకు ఏ ఒక్క పాఠశాలలో కూడా అధికారులు పనులను పూర్తి చే యించలేదు. పాఠశాలలు పునః ప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశించినా పర్యవేక్షణ కరువై, పనులు నెమ్మదిగా సాగుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనుల కోసం ప్రభుత్వం కేవలం 25 శాతం నిధులు మాత్రమే విడుదల చేసింది. పనులు పూర్తయిన అనంతరం మిగతా 75 శాతం నిధులను విడుదల చేయనున్నది. ప్రధానంగా పాఠశాలల్లో తాగు నీరు, విద్యుత్ పునరుద్ధరణ, స్లాబ్ రిపేర్, కిటికీలు, డోర్ల ఏర్పాటు, నూతన మరుగుదొడ్ల నిర్మాణం, ఫర్నిచర్‌ను సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ, నిధులు మాత్రం సరిపడా విడుదల చేయకపోవడంతో పనులు నత్తనడక సాగుతున్నాయి.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులకు ఎంపికైన గుమ్మడూరు ప్రాథమిక పాఠశాల

దామ్యతండా ప్రాథమిక పాఠశాలలో పగిలిన నల్లాలు, (ఇన్‌సెట్) మరమ్మతులు చేయని కిటికీలు

జిల్లాలో 440 అమ్మ ఆదర్శ పాఠశాలల ఎంపిక

జిల్లాలోని 440 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంపిక చేశారు. బయ్యారం మండలంలో 35, చిన్నగూడూరులో 4, దంతాలపల్లిలో 13, డోర్నకల్‌లో 20, గంగారంలో 13, గార్లలో 28, గూడూరులో 34, ఇనుగుర్తిలో 12, కేసముద్రంలో 32, కొత్తగూడలో 24, కురవిలో 34, మహబూబాబాద్‌లో 53, మరిపెడలో 28, నర్సింహులపేటలో 22, నెల్లికుదురులో 31, పెద్దవంగరలో 16, సీరోల్‌లో 13, తొర్రూరులో 28 పాఠశాలలను ఎంపిక చేశారు.

ఈ నెల చివరి వరకు పూర్తి చేయాలని ఆదేశం

అమ్మ ఆదర్శ పాఠశాల పనులు నాణ్యతతో చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ హెడ్‌మాస్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. చాలాచోట్ల పాఠశాలల్లో విద్యుత్ పనులకే ఎక్కువ సమయం కేటాయించి, మిగతా కిటికీలు, డోర్ల మరమ్మతు పనుల్లో జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి త్వరగా పనులు పూర్తి చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

ఏటీఎష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్

మహబూబాబాద్, మే 28 : పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ అన్ని జిల్లాల అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాలోని రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యాలయం నుంచి ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో జాయింట్ చీఫ్ ఎన్నికల అధికారి సర్పరాజ్ అహ్మద్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మహబూబాబాద్ కలెక్టరేట్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్, అదనపు కలెక్టర్ డేవిడ్ పాల్గొన్నారు.

వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

కౌంటింగ్ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్

జిల్లా కేంద్రంలోని స్థానిక సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, జూనియర్ కాలేజీ ఈ నెల 4న నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా చేపట్టాలన్నారు. అడిషనల్ కలెక్టర్ డేవిడ్, గ్రౌండ్ వాటర్ ఏడీ సురేశ్, సీపీవో సుబ్బారావు, డీహెచ్ఎస్‌వో మరియన్న, ఏవో వెంకటరమణ, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఎలక్షన్ సూపరింటెండెంట్ పవన్‌కుమార్, భద్రకాళి, రమణి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని హోటళ్లపై చర్యలు తీసుకోవాలి

తొర్రూరు, మే 28 : జిల్లావ్యాప్తంగా పలు రకాల టిఫిన్స్, భోజనాలు అమ్ముతున్న హోటళ్ల తక్షణమే తనిఖీ చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. ఆహార కల్తీ నిరోధకశాఖ అధికారులు సరిగ్గా తనిఖీలు చేయకపోవడంతో కొన్ని హోటళ్ల యజమానులు శుభ్రతను పాటించటం లేదన్నారు. కల్తీ పిండి పదార్థాలు, నూనెలు, మసాలలు విచ్చలవిడిగా వాడుతున్నారని, ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీస్తున్నారని అన్నారు. కలెక్టర్, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, మంత్రులు జోక్యం చేసుకోవాలని కోరారు. కల్తీ ఆహార పదార్థాలను వినియోగిస్తున్న హోటళ్ల యజమానులపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.

మాజీ సర్పంచ్ రంగనాయకమ్మకు నివాళి

నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మహబూబాబాద్ రూరల్, మే 28: బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కేసన్‌రెడ్డి తల్లి సికింద్రాబాద్ తండా మాజీ సర్పంచ్ కోడూరు రంగనాయకమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బీఆర్ఎస్ మండల నాయకులు మంగళవారం కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల నాయకులు ఇస్లావత్ కవిత రాంజీనాయక్, నర్సింగ్ వెంకన్న, రామచంద్రూనాయక్ పాల్గొన్నారు.

బాలిక సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే

కురవి, మే 28: కురవి మండల కేంద్రానికి చెందిన ధర్మవరపు శశిరేఖ హత్యాన్మరణంతో అనాథగా మారిన మానస పూర్తి బాధ్యతను ప్రభుత్వమే చూసుకుంటుందని శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి వరలక్ష్మి తెలిపారు. అనాథగా మారిన బాలిక మానస విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ స్పందించారు. బాలికను సంరక్షించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కురవి మండల కేంద్రంలోని వీరభద్ర స్వామి కల్యాణ సమీపంలో 13ఏళ్ల బాలిక మానసను మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి వరలక్ష్మి, బాలల సంక్షేమ సమితి చైర్మన్ డాక్టర్ సుంకరనేని నాగవాణి, సభ్యులు డాక్టర్ పరికపండ్ల అశోక్, బాలరక్ష భవన్ కోఆర్డినేటర్ లక్ష్మి పరామర్శించారు. బాలిక చిన్నమ్మ, బాబాయితో మాట్లాడి ప్రభుత్వమే బాలికను చదివిస్తుందని వివరించారు. మానసను మహబూబాబాద్ బాలికల సంరక్షణ కేంద్రానికి తరలించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కో ఆర్డినేటర్ వెంకటేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమణ, అంగన్‌వాడీ టీచర్ల పాల్గొన్నారు.

బాలిక వివరాలు సేకరిస్తున్న శిశు సంక్షేమ శాఖ అధికారులు

'ఆరోగ్య మహిళ' సక్రమంగా నిర్వహించాలి

డిప్యూటీ డీఎంహెచ్‌వో అంబరీష

డోర్నకల్, మే 28: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అంబరీష అన్నారు. మంగళవారం ఆయన డోర్నకల్ పీహెచ్‌సీ, వెన్నారం, తోడేళ్లగూడెం, ముల్కలపల్లి, మన్నెగూడెం గ్రామాల్లో సబ్ సెంటర్లను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి మాట్లాడారు. మహిళల్లో వచ్చే వ్యాధులను అరికట్టేందుకు వారికి సలహాలు, సూచనలు ఇవ్వాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు సంఖ్యను పెంచి, నార్మల్ డెలివరీలను ప్రోత్సహించాలన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సబ్ యూనిట్ ఆఫీసర్ వీ శ్రీనివాస్, వైద్యాధికారిణి సద్విజ, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఏఎన్ ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీడీఎంహెచ్‌వో అంబరీష

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి వార్షికోత్సవం

తొర్రూరు, మే 28: మాతా గోవిందాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి 19వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. డివిజన్ కేంద్రంలోని పాటిమీద ఆలయంలో స్వామికి సుప్రభాత సేవ, మూలవిరాట్లకు పంచామృత అభిషేకాలు, గణాధిపతిపూజ, సకల దేవతల హోమాలు, పూర్ణాహుతి, మాతా శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి శాంతి కల్యాణం తదితర పూజలు బ్రహ్మ శ్రీ విశ్వప్రకాశాచార్యులు, ఆయన శిష్య బృందం, ఆలయ ప్రధాన అర్చకుడు రామగిరి విక్రమ్‌శర్మ, రాగి భాస్కరాచార్యులు నిర్వహించారు. స్వామి వారి కల్యాణానికి తంగెళ్లపల్లి పూర్ణాచారి, కల్యాణి దంపతులు పుస్తె మట్టెలు, భక్తుల సహకారంతో ప్రసాదం, అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహణ శాశ్వత నిధి కమిటీ అధ్యక్షుడు కల్లూరి నాగేంద్రాచారి, కార్యదర్శి తంగెళ్లపల్లి పూర్ణాచారి, కోశాధికారి చంద్రశేఖరాచారి, ఉపాధ్యక్షులు సదానందాచారి, వెంకటాచారి, విశ్వబ్రాహ్మణ పట్టణ అధ్యక్షుడు కల్లూరి కుశాలు, జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నోజు విజయకుమార్ పాల్గొన్నారు. వార్షికోత్సవ సందర్భంగా గోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఉత్సవాల మహిళా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఇటికేల విజయలక్ష్మి, కార్యదర్శిగా సిరికొండ సరస్వతి, కోశాధికారిగా కల్లూరి కళావతి, ఉపాధ్యక్షులుగా కల్లూరి స్వరూప, కల్లూరి నాగమణి, బోగోజు జయరేఖ, తంగళ్లపల్లి కళ్యాణి, సహాయ కార్యదర్శులు ఉమా రాణి, రజిత, కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

వీరబ్రహ్మేందస్వామికి పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నూతన సాగు విధానాలతో అధిక దిగుబడి

నెల్లికుదురు, మే 28 : వానకాలంలో రైతులు పత్తి పంట సాగులో నూతన విధానాలు పాటిస్తే తక్కువ పెట్టిబడితో ఎక్కువ దిగుబడి వస్తుందని ఏఈవోలు కల్యాణి, శిరిష, చందన రైతులకు సూచించారు. మండలంలోని మునిగలవీడు, ఆలేరు, ఎర్రబెల్లిగూడెం రైతు వేదిక భవనాల్లో మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు వారు మాట్లాడుతూ.. స్వల్పకాలిక పత్తి వేస్తే గులాబీ పురుగును ఎదుర్కోవడంతోపాటు అధికదిగుబడి సాధించవచ్చన్నారు. నవంబర్ చివరినాటికి యాసంగి రెండో పంటకు వెళ్లొచ్చునని సూచించారు. అధిక సాంద్రత విధానంలో సాలు సాలుకి మధ్య దూరం రెండున్నర అడుగులు, మొక్కల మధ్య అర ఫీట్ దూరం పాటించాలన్నారు. దీంతో సాధారణ పద్ధతిలో ఎకరాకు 6 నుంచి 8 వేల మొక్కలు నాటితే, ఈ పద్ధతిలో 18 వేల నుంచి 20 వేల మొక్కలు నాటుకోవచ్చన్నారు. మొక్కలు ఎక్కువగా పెరగకుండా పరిస్థితిని బట్టి రెండుసార్లు 45 రోజులకోసారి, 65 రోజులకోసారి మెపిక్వాట్ క్లోరైడ్ మందును పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ల పరిధిలోని రైతులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నాణ్యమైన విత్తనాలు అందించాలి

గార్ల, మే 28: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడంతోపాటు పాత రుణాలు మాఫీ చేసి, కొత్త రుణాలు మంజూరు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందించాలని కోరారు. రైతు కూలీ సంఘం నాయకులు సక్రు, మాన్యానాయక్ పాల్గొన్నారు.

పెద్దనాగారం స్టేజీ అంగడి వేలం

నర్సింహులపేట, మే 28: మండలంలోని పెద్దనాగారం స్టేజీ గ్రామ పంచాయతీలో ప్రతి గురువారం నిర్వహించే అంగడి వేలంపాటను మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన్నట్లు ఎంపీవో సోమ్లాల్ తెలిపారు. గ్రామస్తుల సమక్షంలో జరిగిన వేలంలో రేఖాశ్రీను అనే వ్యక్తి రూ.26వేలకు తీసుకున్నట్లు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

గార్ల, మే 28: మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన నేతగాని సుధీర్(29) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. రూ.18,140 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు నవీన్, శ్రీను, సుమంత్, అశోక్, నాగరాజు, నరేశ్ పాల్గొన్నారు.

వడదెబ్బతో మహిళ మృతి

లింగమ్మ (ఫైల్)

దంతాలపల్లి, మే 28 : వడదెబ్బతో మహిళ మృతిచెందిన ఘటన మండలంలో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని రామవరం గ్రామానికి చెందిన గంగినేని లింగమ్మ (65) రోజు మాదిరిగానే ఉపాధి పనికి వెళ్లింది. పని నుంచి ఇంటికి వచ్చి కుప్పకూలింది. గమనించిన కుటుంబ సభ్యులు దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందింది. లింగమ్మకు భర్త, కొడుకు ఉన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

డోర్నకల్/ గార్ల, మే 28 : మాజీ సీఎం నందమూరి తారకరామారావు జయంతిని డోర్నకల్ పట్టణంలోని పెట్రోల్ బంక్ ఎదురుగా ఆయన అభిమాని బిక్కసాని రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ అభిమానులు, నాయకులు తాళ్లూరి హనుమ, మాదా శ్రీనివాస్, శీలం శ్రీను, మల్లం అనిల్, గాజుల వేణు, రహీం, మున్సిపల్ చైర్మన్ వీరన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ కోటిలింగం, కౌన్సిలర్ జనార్దన్, మాజీ జడ్పీటీసీ గొర్ల సత్తిరెడ్డి పాల్గొన్నారు. గార్లలో ఎన్టీఆర్ జయంతిని టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, కత్తి సత్యం, రమేశ్, టీకే లక్ష్మణ్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

డోర్నకల్: ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఉపాధ్యాయులను సబ్జెక్టు బోధనకే పరిమితం చేయాలి

మహబూబాబాద్ రూరల్, మే 28 : సైన్స్ ఉపాధ్యాయులను సైన్స్ బోధనకే పరిమితం చేయాలని ఫిజికల్ సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు దిడ్డి అనిల్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం 6, 7 తరగతుల గణితం సబ్జెక్ట్‌ను ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు బోధించాలని సరికాదని, రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కో సబ్జెక్ట్‌కు ఒక టీచర్‌ను నియమించినట్లు తెలిపారు. భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులపై గణిత శాస్త్రాన్ని రుద్దడం సరికాదని తెలిపారు. వెంటనే ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు.

'హత్యాయత్నం కేసు నమోదు చేయాలి'

కురవి, మే 28 : కురవి మండల పరిధిలోని నేరడలో బీఆర్ఎస్ నాయకుడు, కురవి సొసైటీ చైర్మన్ దొడ్డ గోవర్ధన్‌రెడ్డిపై రెండు రోజుల క్రితం దాడి జరుగగా, పోలీసులతో మాట్లాడేందుకు మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్ మంగళవారం కురవి పోలీసుస్టేషన్‌కు వచ్చారు. కురవి సొసైటీ చైర్మన్ దొడ్డ గోవర్ధన్ రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు దాడి చేసిన విషయమై మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై గోపీతో చర్చించారు. హత్యాయత్నం కింద కేసు నమోదు చేయాలన్నారు. విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని రెడ్యానాయక్‌కు పోలీసులు హామీ ఇచ్చారు.

రైతులపై లాఠీచార్జిని ఖండిస్తున్నాం..

కొత్తగూడ, మే 28 : ఆదిలాబాద్‌లో రైతులపై లాఠీచార్జిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ కొత్తగూడ మండల అధికార ప్రతినిధి బానోత్ నెహ్రూనాయక్ అన్నారు. కొత్తగూడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విత్తనాల కోసం బారులు తీరిన రైతులపై లాఠీచార్జి చేయడం సరికాదన్నారు. లాఠీచార్జి చేసిన అధికారులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సమస్యలపై సీఎం వెంటనే ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించాలని కోరారు. లేదంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

బాధిత కుటుంబానికి పరామర్శ

కురవి, మే 28 : కురవి మండలం నమస్తే తెలంగాణ రిపోర్టర్ సంగెం నాగరాజు తల్లి సంకెం లక్ష్మీవీరమ్మ (70) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్ ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, గుగులోత్ రవి, బాదె నాగయ్య, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌కు విద్యార్థి ఎంపిక

మణికంఠ సాయిశ్రేయన్

కురవి, మే 28: కురవి మండల కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న హలావత్ మణికంఠసాయి శ్రేయన్‌కు సైనిక్ స్కూల్‌లో సీట్ లభించినట్లు పాఠశాల కరస్పాండెంట్ అల్వాల కార్తీక్ మంగళవారం తెలిపారు. కరీంనగర్ జిల్లా రుక్మాపూర్‌లోని సైనిక్ స్కూల్‌లో సీటు వచ్చిందన్నారు. విద్యార్థిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

విత్తన కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలి

దంతాలపల్లి, మే 28 : వానకాలం పంటల సాగుకు సిద్ధమవుతున్న రైతులకు మంగళవారం మండలంలోని పెద్దముప్పారం గ్రామంలోని రైతు వేదికలో పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఏఈవో సందీప్ మాట్లాడుతూ.. రైతులు దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. వరి పంట నేరుగా విత్తే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొండ మధు, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ సభ్యుడు చైతన్యసాయి, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో సందీప్

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా మహబూబాబాద్ జిల్లా, కురవి మండలం, కందికొండ, బీసీ కాలనీ గ్రామ కాపురస్తులుగు శ్రీ గడ్డికొప్పుల అశోక్, తండ్రి: వెంకన్న, నివాసం: గ్రామము కందికొండ బీసీ కాలనీ, మండలం కురవి, జిల్లా- మహబూబాబాద్ వీరు శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ మహబూబాబాద్ బ్రాంచీ వారిని ఋణ సదుపాయం పొందుటకు హామీగా ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని తమ రిజిష్టర్ విక్రయ దస్తావేజు నెం. 10778/2021, తేది: 17-08-2021 మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ వారి సమక్షములో రిజిష్టర్ కాబడిన దాని ద్వారా సంక్రమించిన ఆస్తిని హామీగా ప్రతిపాదించగా సదరు శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ వారు తమ సమ్మతిని తెలిపియున్నారు. సదరు షెడ్యూల్ ఆస్తి విషయమై గాని సదరు ఋణ సదుపాయ విషయమైగాని ఎవరికేనీ ఎలాంటి అభ్యంతరములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన (5) దినములలో తగు ఆధారములతో ఈ దిగువ తెలిపిన అడ్రస్ యందు సంప్రదించగలరు. లేని యెడల ఎలాంటి అభ్యంతరములు లేవని తలచి సదరు ఋణ సదుపాయ విషయమై పై కంపెనీ వారు తదుపరి చర్యలు గైకొందురు. గడువు తర్వాత వచ్చిన అభ్యంతరములు పరిగణలోకి తీసుకోబడవు.

షెడ్యూలు ఆస్తి: మహబూబాబాద్ జిల్లా, మహబూబాబాద్ మండలం, మహబూబాబాద్ మున్సిపల్ పరిధిలోని సర్వే నెం. 469/2/1, ప్లాట్ నెం. 08, విస్తీర్ణం: 122.22 చ.గ.లు సమము 102.19 చ.మీ.లు గల దానికి హద్దులు: తూర్పు: ఎస్. రాకేష్ గారి స్థలము, పడమర: 30 ఫీ